## క్లుప్తంగా

### తాగునీటి విడుదలపై హర్షం..



పాలాభిషేకం చేస్తున్న పాలెపు విజయ

**ఖమ్మంమయూరిసెంటర్:** మెయిన్, మినీ లకారం చెరువుల్లోకి నీటిని పాలేరు నుంచి నీటిని విడుదల చేయించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగర ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యకు పరిష్కారం చూపించారని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ అన్నారు. పాలేరు నుంచి చెరువులకు, మున్నేరుకు నీటిని విడుదల చేయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వేసవిని దృష్టిలో ఉంచుకొని నగర ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జాని, ఖలీల్, సతీష్, చానా, వెంకట్రావ్, షకీల్, కోటి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరం

**నేలకొండపల్లి:** గంగాధర రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు రాజ్‌కుమార్, కావ్య చంద్ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామీణ వైద్యులు బండి పుష్పలత, బీ.నాగేశ్వరరావు, తానీషా, రఘుకుమార్, ఈగ అనిల్‌కుమార్, సేవా కమిటి కన్వీనర్ ఏటుకూరి రామారావు, కె.వీ.రెడ్డి, జీ.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, వి.భాస్కర్‌రావు, కె.నారాయణ, మంకెనపల్లి నరసింహారావు, కొదండ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన నాయకులు

**ఖమ్మంవన్‌టౌన్:** జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ యుగంధర్ ఆదివారం కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రంజాన్ మాసం సందర్భంగా నగరంలో ఉన్న మసీదులకు మరమ్మతులు చేపట్టాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు మహ్మద్ ఆశ్రిఫ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మంవన్‌టౌన్:** ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు యుగంధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నగరంలోని ఆటో అడ్డాల్లో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, అదేవిధంగా ట్రాఫిక్ పోలీసులు చలాన్లు రాస్తున్నారని వాటిని ఆపాలన్నారు. ఇళ్లు లేని ఆటోడ్రైవర్లను గుర్తించి వారికి ఇళ్లు అందజేయాలని కోరగా, మంత్రి తుమ్మలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. నగర అధ్యక్షుడు నరాల నరేష్ మోహన్ నాయుడు, విప్లవ్ కుమార్, బొడ్డు సైదులు, నాగరాజు, ప్రసాద్, పాషా, వెంకట్, గోపాల్, జానీ, ఉమర్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | ప్రేమలు |
| వినోద | గామీ |
| సాయిరాం | ఆపరేషన్ వాలంటైన్ |
| ఆదిత్య | సైతాన్ |
| శ్రీనివాస | భీమా |
| సుందర్ | హను-మాన్ |

- ఖమ్మం గాంధీచౌక్

## ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 18 | బచ్చలికూర | 3 |
| వంకాయ | 36 | | 20 |
| బెండకాయ | 36 | పాలకూర | 3 |
| పచ్చిమిర్చి | 40 | | 20 |
| కాకర | 46 | చుక్కకూర | 3 |
| బీర | 40 | | 20 |
| దొండ | 26 | తోటకూర | 2 |
| పొట్లకాయ | 40 | | 10 |
| నాటు చిక్కుడు | 100 | గోంగూర | 2 |
| గోరుచిక్కుడు | 46 | | 10 |
| క్యాబేజీ | 26 | మెంతికూర | 3 |
| క్యాలీఫ్లవర్ | 25 | | 20 |
| ఆలుగడ్డ | 24 | కొత్తిమీర | 1 |
| చామగడ్డ | 50 | | 30 |
| క్యారెట్ | 40 | పుదీన | 1 |
| క్యాప్సికం | 56 | | 20 |

-ఖమ్మం వ్యవసాయం

# ఆదాయం అంటే అలుసా..?

## ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లలో జాప్యం

- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- ఆదాయం కోల్పోతున్న కేఎంసీ



**ఖమ్మంమయూరిసెంటర్:** నగరాలు, పట్టణాల అభివృద్ధి ప్రధానంగా ఆదాయ వనరులపైనే ఆధారపడి ఉంటుంది. ప్రజలు చెల్లించే పన్నులు, పౌర సేవలందించేందుకు చెల్లించే రుసుములు, లైసెన్సుల మంజూరుతో ఆదాయం అధికంగా వస్తుంది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి, పంపు పన్నుల తర్వాత అధికంగా ఆదాయం సమకూరేది ట్రేడ్ లైసెన్సులతో మాత్రమే. పన్నుల వసూలులో రాణిస్తున్న కేఎంసీ అధికారులు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ట్రేడ్ లైసెన్సుల ద్వారా నగరంలో రూ.3 కోట్ల వరకు ఆదాయం పొందవచ్చు. అయితే ఆ స్థాయిలో లైసెన్సులు జారీ చేయకపోవడంతో కేఎంసీ పెద్ద మొత్తంలో ఆదాయాన్ని కోల్పోతుంది.

**పెరుగుతున్న అలసత్వం..**

నగరంలో వందలాది రకాల వ్యాపారాలు జరుగుతున్నాయి. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో జనావాసాలు కన్నా వ్యాపార వాణిజ్య సముదాయాలే ఎక్కువగా ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అయితే వీటిల్లో ట్రేడ్ లైసెన్సులు కలిగిన దుకాణాలు మాత్రం వందల సంఖ్యలో కూడా లేవనే ఆరోపణలున్నాయి. ఇక ఉన్న లైసెన్సులను రెన్యువల్ చేయడంలోనూ జాప్యం జరుగుతుంది. లైసెన్సులు లేని దుకాణాలకు లైసెన్సులు జారీ చేయడంలో కేఎంసీ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సగం మంది కూడా లైసెన్సులు తీసుకోవడం లేదని, దీని మూలంగా కేఎంసీ ఆదాయం కోల్పోతుందన్న విమర్శలు ఉన్నాయి.

**సిబ్బంది నిర్లక్ష్యం..**

నూతన మున్సిపల్ చట్టం ప్రకారం వాణిజ్య, వ్యాపార సంస్థలకు ట్రేడ్ లైసెన్సుల జారీ వ్యాపార సముదాయాల కొలతల ప్రకారం ఫీజులు నిర్ణయించాల్సి ఉంది. అయితే కొంత మంది అధికారుల తీరుతో కేఎంసీ ఆదాయానికి గండి పడుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. షాపుల కొలతలు తూతూ మంత్రంగా తీసుకోవడం, కొన్నింటికి అసలు లైసెన్సు జారీ చేయకపోవడంతో ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రేడ్ లైసెన్సుల ఫీజుల వసూళ్లు కమిషనర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. వీరు ఈ ఫీజులను వసూలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చూపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇక ఒకరిద్దరు ఇన్‌స్పెక్టర్లు సీనియర్లమంటూ చెప్పుకుని కార్యాలయంలోనే ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఫీల్డ్‌లో సక్రమంగా పనులు చేయడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు సైతం సదరు సిబ్బందిని తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటూ కేఎంసీకి వచ్చే ఆదాయాన్ని రాబట్టడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతుంది.

**ఆదాయం కోల్పోతున్న వైనం..**

నగరంలో వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ యాక్ట్ ప్రకారం ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి. అయితే నగరంలో వ్యాపార సముదాయాలు పదివేలకు పైగా ఉన్నా.. లైసెన్సులు కలిగి ఉన్నది మాత్రం చాల తక్కువ. ఆస్తి, పంపు పన్నుల ద్వారా కేఎంసీకి భారీగానే ఆదాయం వస్తున్నప్పటికీ ట్రేడ్ లైసెన్సులతో మాత్రం ఆశించిన మేరా రావడం లేదు. నగరంలో సుమారు 200 ఆస్పత్రులు ఉండగా.. వారంతా కొత్త చట్టం ప్రకారం పన్నులు చెల్లించలేమని న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకోగా.. వారి నుంచి సుమారు రూ.2 కోట్ల ఆదాయం నిలిచిపోయిందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక ఇతర వ్యాపార సముదాయాలు ట్రేడ్ లైసెన్సులు తీసుకోకపోవడంతో అనేక భవనాల్లో ఉన్న వ్యాపార సముదాయాలకు సంబంధించి కమర్షియల్‌కు బదులు రెసిడెన్షియల్ భవనాలుగా చూపించి పన్నులు చెల్లిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో కేఎంసీకి రావాల్సిన ఆదాయంలో భారీగా గండి పడుతుందన్న ఆరోపణలున్నాయి.

# బెదిరింపులు, కేసులు లేని పాలన..

- రోడ్డు పనుల శంకుస్థాపన, సమీక్షలో మంత్రి తుమ్మల



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**రఘునాథపాలెం:** బెదిరింపులు, పోలీసు కేసులు లేని పాలన ఇస్తానని చెప్పి విధంగానే పాలన అందిస్తున్నామని, గతంలో బెదిరించి దోచుకున్న ఏ ఒక్కరిని వదిలేది లేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలో రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు వరకు ఇల్లెందు–ఖమ్మం ప్రధాన రోడ్డుకు చేపడుతున్న నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేసి అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. రఘునాథపాలెంను మండలంగా ఏర్పాటు చేసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేసుకునేందుకు పెద్ద ఎత్తున నిధులు తెచ్చుకోవడం జరిగిందని ఈ మేరకు ప్లానింగ్ ప్రకారం అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఆరుగ్యారంటీ పథకాలను వరస క్రమంలో ఒక్కొక్కటి ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం అక్రమాల ద్వారా రూ.7 వేల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీసిందన్నారు. నేడు భద్రాది రాముడు సమక్షంలో పేదలకు స్థలం ఉంటే రూ.5 లక్షలు, స్థలం లేని వారికి స్థలంతో పాటు, రూ 5 లక్షలతో ఇళ్లు కట్టించే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారన్నారు.

**పెండింగ్ పనులు లేకుండా చేయాలి..**

మండలంలో ఎలాంటి పనులు పెండింగ్ లేకుండా చేయాలని, తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా వేసవిలో అప్రమతంగా ఉండి తాగునీరు అందించాలని, భూ సమస్యలు ఉంటే వాటిని సాధ్యమైనంత మేరా పరిష్కరించాలని అధికారులను సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శిథిలమైన భవనాలు ఉంటే ఆలాంటి వాటిల్లో విద్యార్థులకు కూర్చో పెట్ట వద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, పీఆర్ ఈఈ మహేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వాణిశ్రీ, ఎఫ్‌ఆర్‌ఓ రాధిక, ఏడీఏ శ్రీనివాసరావు, ఎం.భాస్కర్, ఎంపీడీఓ అశోక్, తహసీల్దార్ విల్సన్ బెన్నీ, మండల ప్రత్యేక అధికారి మురళీధర్, ఎంఈఓ శ్రీనివాస్, ఎఈలు ఆదిత్యరాజు, విశ్వనాథం, చిరంజీవి, విద్యుత్ ఏడీ సంజయ్‌కుమార్, జలవనరులశాఖ డీఈ ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ భూక్యా గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, నాయకులు జావిద్, మానుకొండ రాధాకిషోర్, వెంకటేశ్వర్లు, మల్లీదు జగన్, పల్లెబోయిన చంద్రం, నరసింహరావు, ఎంపీటీసీ వల్లభనేని సత్యావతి తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌ఓసీ అందజేత..**

**ఖమ్మంవన్‌టౌన్:** ఖమ్మం నగరంలోని స్థానిక 46వ డివిజన్‌లో వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న గవ్వల వీరమ్మకు ఆపరేషన్ కోసం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2 లక్షల 50ల ఎల్‌ఓసీ మంజూరవ్వగా ఆ ఎల్‌ఓసీని మంత్రి తుమ్మల తన క్యాంపు ఆఫీస్‌లో అందజేశారు. నాయకుడు సాధు రమేష్‌రెడ్డి, బాణాల లక్ష్మణ్, బీరేష్, రామకృష్ణ, రవీందర్, నాగేశ్వరరావు తదిదరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



బోరు మోటారును పరిశీలిస్తున్న సీఈ

**కూసుమంచి:** వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈ శ్రీనివాస్ అధికారులకు సూచించారు. మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో తాగునీటి ఎద్దడి రాకుండా చేపట్టిన ముందస్తు చర్యలను ఆదివారం ఆయన పరిశీలన చేసి పలు సూచనలు చేశారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు మూడు కొత్త మోటార్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు సీఈకి వివరించారు. గ్రామంలోని జనాభా, నీటి వినియోగం తదితర వివరాలను అడిగి తెలుసుకున్న సీఈ ఏ ఒక్కరికీ తాగునీటి సమస్య తలెత్తవద్దన్నారు. గ్రామంలో నీటి లభ్యత ఉన్న వనరులను గుర్తించి వాటిని వినియోగించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేపడుతున్నామని, అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ రంజిత్‌కుమార్, పంచాయతీ ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి శశికళ, కాంగ్రెస్ నాయకులు పెండ్ర అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# హామీలు కచ్చితంగా అమలు..



మాట్లాడుతున్న కిషోర్ రెడ్డి

**ఖమ్మం మామిళ్లగూడెం:** ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చే హామీలు కచ్చితంగా అమలు చేస్తారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వెనకంజ వేస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈనెల 12న కేంద్ర హోంమంత్రి అమీత్‌షా ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మీడియా సోషల్ మీడియా కార్యకర్తల సమావేశానికి ఆహ్వానించడంతోపాటు అదేరోజు మధ్యాహ్నం రెండు గంటలకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర, బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. కాళేశ్వరం అవినీతిపై అవలంభిస్తున్న ద్వంద వైఖరిని దుయ్యబట్టారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కరించాలని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళిక బద్ధంగా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ రెడ్డి ఖమ్మం పార్లమెంటరీ నాయకులు తాండ్ర వినోద్‌రావు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో నాయకులు తాండ్ర వినోద్‌రావు, డాక్టర్ గొంగూర వెంకటేశ్వర్లు, దేవకి వాసుదేవరావు, శ్యామ్ రాథోడ్, మంద సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, కిరణ్, వెంకటనారాయణ యాదవ్, సాయిరాం, జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రభుత్వ వసతి గృహాల్లో కల్పించనున్న వసతులను సద్వినియోగం చేసుకొని, పరీక్షలలో మంచి ఫలితాలు సాధించాలని, సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలని ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ సూచించారు. నగరంలోని ఎస్సీ ఆనంద నిలయం బాలికల వసతిగృహంలో ఆదివారం వసతిగృహ సంక్షేమ అధికారిణి ఎం.విజయలక్ష్మి ఆధ్వర్యంలో హాస్టల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు ఈ వేడుకల్లో నృత్యాలు చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, ఖమ్మం డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ ఏ.శ్రీలత, హెచ్‌డబ్ల్యూవో ఎస్.విజయ, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నూతన దంపతులకు ఆశీర్వాదం



శుభాకాంక్షలు తెలుపుతున్న డీఐజీ రంగనాథ్

**ఖమ్మంసహకారనగర్:** ఇటీవల వివాహమైన బీఆర్‌ఎస్ నాయకులు గుండాల కృష్ణ కుమార్తె ధాత్రి దంపతులను వరంగల్ రేంజ్ డీఐజీ ఏవీ రంగనాథ్ దంపతులు ఆశీర్వదించారు. ఈ మేరకు డీఐజీ రంగనాథ్ సతీసమేతంగా ఆదివారం ఖమ్మం వచ్చి కృష్ణ ఇంటికి వచ్చి తమ ఆశీస్సులు అందించారు.

### విద్యార్థులు ఇష్టపడి చదవాలి

**కామేపల్లి:** పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదవాలి కానీ కష్టపడి కాదని బాసిత్‌నగర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గిరిధర్ అన్నారు. స్థానిక పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బాదావత్ రాందాస్ వితరణగా అందించిన పరీక్షా సామగ్రిని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాదావత్ శ్రీను, సునావత్ సూర్య, బానోత్ రాందాస్, శ్రీను, బాలాజీ, నరేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

# పెండింగ్ డీఏలు, బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న మధు

**ఖమ్మంసహకారనగర్:** రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం పెండింగ్ డీఏలను, బిల్లులను తక్షణమే విడుదల చేయాలని టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు కోరారు. ఆదివారం నగరంలోని సంఘ నూతన భవనంలో పీఆర్‌టీయు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్‌ని పునరుద్ధరించాలన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులను వారి అభిష్టం మేరకు తమ పూర్వ జిల్లాకు స్థాన చలనం కలిగేలా చూడాలని, 2003 డీఎస్సీ వారికి తక్షణ పాత పెన్షన్ వర్తింపుజేయాలన్నారు. వీటితో పాటు ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావు, మాస పత్రిక ఉపసంపాదకులు చిత్తలూరి అపసాద్, యలమద్ది వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, రెబ్బా శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వర్లు, హుస్సేన్, జాలహరిత, జి.సుజాత, విజయ, అమృత్ కుమార్, కట్టా శేఖర్, సోమ్లా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### 'సూర్యఘర్ యోజన'పై అవగాహన



మాట్లాడుతున్న వీరభద్ర ప్రసాద్

**ఖమ్మం మామిళ్లగూడెం:** ప్రధాని నరేంద్ర మోదీ పథకాలు పేదలపాటి పెన్నిదిగా ఉన్నాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మూర్తి వీరభద్ర ప్రసాద్ అన్నారు. ఆదివారం ఖమ్మం రిక్కా బజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డిపార్టుమెంట్ సూపర్‌వైజర్ వెంకట శ్రీరామచంద్రమూర్తి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శివాలయాలను అభివృద్ధి చేయాలి

**కూసుమంచి:** కూసుమంచిలోని కాకతీయులకాలం నాటి ప్రాచీన శివాలయాలను పునరుద్ధరణ చేసి అభివృద్ధి పర్చాలని కోరుతూ బీజేపీ నాయకులు తాండ్ర వినోద్‌రావు పురావస్తుశాఖ సంచాలకులకు లేఖ రాశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన ఆయనకు స్థానిక నేతలు ఆలయాల పరిస్థితిని వివరించారు. దీంతో స్పందించిన ఆయన పురావస్తు శాఖకు లేఖ రాశారు. ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లు నాయక్‌తో వినోద్‌రావు ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

**ఖమ్మం మామిళ్లగూడెం:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ వైద్యురాలు విజయలక్ష్మి తోపాటు పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉపేందర్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి, జనార్దన్, తాతా రాఘవయ్య, శంకరయ్య, గట్టు మోహన్, పుల్లారావు, శ్రీహరి పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఖమ్మంవ్యవసాయం:** నగరంలోని 33/11 కేవీ ఇల్లెందు క్రాస్ రోడ్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కవిరాజ్ నగర్ ఫీడర్, ఎన్ఎస్‌పీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఆర్టీఓ ఆఫీస్ ఫీడర్ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-3 ఆపరేషన్స్ ఏఈ బి.తావుర్యా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కవిరాజ్‌నగర్ రోడ్ నంబర్ 9, 10 లలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు, త్రివేణి స్కూలు ప్రాంతం మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు, బైపాస్ రోడ్ వికలాంగుల కాలనీ, రమణగుట్ట, శ్రీరాంగిరి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

# మిలియన్ మార్చ్ ఓ అపూర్వ ఘట్టం



నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

**ఖమ్మంగాంధీచౌక్/ ఖమ్మం మామిళ్లగూడెం:** తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఓ అపూర్వ ఘట్టమని ఉద్యమకారులు అభిప్రాయపడ్డారు. మిలియన్ మార్చ్ 13 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులు ఆదివారం నగరంలోని ఉద్యమకారుల అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. మిలియన్ మార్చ్ ఉద్యమానికి పునాది వేసిందని తమ భావాలను వ్యక్తపర్చారు. ఈ కార్యక్రమంలో ములక సురేష్, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, పోతురాజు రమాదేవి, కుమారి, కామిశెట్టి శ్రీనివాస్, బాబు, ఉదయ భాస్కర్, ఏనుగు వెంకటేశ్వర్లు, రఘు, ఎండీ ఆఫీస్ అహ్మద్, నాగుల్ మీరా, సయ్యద్ బుడాన్, చావా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి జీవితం ఆదర్శం

**ఖమ్మంమయూరిసెంటర్:** భారతదేశంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని, ఆమె జీవితం ఆదర్శనీయమని తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అన్నారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహం వద్ద సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు తాటి నిర్మల, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, నాయకులు తోట రామాంజనేయులు, గాదె లక్ష్మినారాయణ, నూనె శశిధర్, రావుల హన్మంతరావు, మందా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం మామిళ్లగూడెం:** దళిత రత్న అవార్డుగ్రహిత, తెలంగాణ మాదిగ హక్కుల దండోర రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఖమ్మం దళిత బహుజన కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ బెల్లం కొండ శ్యామల, నాగమణి, వీరమ్మ, పద్మ, వెంకన్న, మధు, చిన్న భద్రయ్య, రాజేష్ పాల్గొన్నారు.

**నేలకొండపల్లి:** మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, మండల నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, హనుమంతరావు, మీగడ గోపి, కందరబోయిన వెంకటరమణ, పిట్టల సూరిబాబు, బాజా రామకృష్ణ, ఇస్లావత్ నాగేశ్వరరావు, చల్లా మల్లేష్‌రావు పాల్గొన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ మాదిగ హక్కుల దండోర ఆధ్వర్యంలో..



ఖమ్మంమయూరిసెంటర్: సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నేలకొండపల్లిలో..